పరీక్షలు పాసైతేనే ప్రవేశం



30 మీటర్ల పరుగులో పాల్గొన్న విద్యార్థులు

చేగుంటలోని తెలంగాణ గిరిజన బాలికల క్రీడా పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఆదివారం దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల విద్యార్థినులు పాల్గొన్నారు. మెడిసిన్ బాల్ త్రో, బ్రాడ్‌జంప్, షటిల్‌రన్, పరుగు, ఎత్తు, బరువు వంటి పరీక్షలను నిర్వహించారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ చూపితేనే ప్రవేశాలు లభిస్తాయి. విద్యార్థులు ఉదయం నుంచే తమ తల్లిదండ్రులతో క్రీడా పాఠశాలకు చేరుకున్నారు. గిరిజన గురుకులాల క్రీడాధికారి రవికుమార్ ఆధ్వర్యంలో ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు కూడా దేహదారుఢ్య పరీక్షలు చేశారు. -న్యూస్‌టుడే, చేగుంట



సిద్దిపేటలోని పరీక్ష కేంద్రంలో తనిఖీలు

'నీట్ పీజీ' ప్రవేశ పరీక్షకు 271 మంది హాజరు

సిద్దిపేట: సిద్దిపేటలోని రెండు కేంద్రాల్లో నీట్ పీజీ-2026 ఆదివారం సజావుగా జరిగింది. ఎనిమిది మంది గైర్హాజరు అయ్యారు. ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు సీబీటీ విధానంలో పరీక్ష జరిగింది. రెండు గంటల ముందు నుంచే తనిఖీ చేస్తూ లోనికి అనుమతించారు. వెంకటేశ్వర్ణా కేంద్రంలో 229 మందికి 222 మంది, ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో 50 మందికి 49 మంది హాజరయ్యారు. అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్వో నాగరాజమ్మ, ఏసీపీ రవీందర్‌రెడ్డి పరిశీలించారు.



బూట్లు పరిశీలిస్తూ..

నీటి గుండాలు కావు.. గండాలే

న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం, కోహెడ, నంగునూరు:

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

జిల్లాలో పలు చోట్ల రహదారులు అధ్వానంగా మారాయి. కొన్ని చోట్ల తారు లేచి గుంతలు ఏర్పడ్డాయి. వర్షం పడితే చాలు జలమయం అవుతున్నాయి. వారాల తరబడి చిత్తడిగా ఉండి ప్రయాణాలకు ఆటంకాలు కలిగిస్తున్నాయి. రాత్రి పూట నీటి గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారు.



నంగునూరు మండలం మాసిరెడ్డిపల్లి చౌరస్తా..

జలానికి దారి లేదు

మాసిరెడ్డిపల్లి చౌరస్తా లోతట్టు ప్రదేశంలో ఉంది. వర్షం పడితే ఇక్కడ వర్షపు నీరు పెద్ద ఎత్తున నిల్వ ఉంటోంది. రోడ్డు కిందికి వెళ్లే దారి లేదు. లోతు తెలియక నంగునూరు మండలం నాగరాజుపల్లి, నంగునూరు, అంకుశాపూర్, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గుంతల్లో పడిపోతున్నారు.

ధ్వంసమైన మట్టి

కోహెడ గ్రామ పంచాయతీ పరిధిలోని వెల్దండపల్లికి వెళ్లే మట్టి రోడ్డు ధ్వంసమైంది. పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. మట్టి రోడ్డు కావడంతో ఒక్కోసారి బురదలో బండ్లు దిగబడుతున్నాయి. దెబ్బతిన్న ఈ రోడ్లకు మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కోహెడ-వెల్దండపల్లి రోడ్డు

బాగు చేయాల్సిన దగ్గరి దారి

అక్కన్నపేట మండలం గండిపల్లి నుంచి పంచరాయితండా రోడ్డు అధ్వానంగా మారింది. గండిపల్లి ప్రాజెక్టు కట్టపై నుంచి వెళ్లే ఈ రోడ్డు వర్షంతో బురదమయంగా మారింది. తండావాసులతో పాటు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గండిపల్లి నుంచి దాక్యాతండా, శ్రీరాంతండా, బాబురావుతండా, దేక్యానాయక్‌తండా, అంబన్‌నాయక్‌తండా మీదుగా పంచరాయితండాకు తారు రోడ్డు వేసినప్పటికీ 8 కి.మీ. దూరం వెళ్లాల్సి వస్తోందని తండావాసి బూక్యా శ్రీనివాస్ తెలిపారు. ప్రాజెక్టు కట్టపై వెళితే కేవలం 600 మీటర్లు ఉంటుందన్నారు. హుస్నాబాద్ మండలం పందిల్ల నుంచి గోవర్ధనగిరి, రేగొండ వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. వందల కొద్దీ వాహనాలు తిరిగే ఎల్కతుర్తి-సిద్దిపేట జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఈ రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి.



గండిపల్లి-పంచరాయితండా మార్గం

తరలివచ్చి వనదుర్గమ్మ సేవలో తరించి

పాపన్నపేట(మెదక్ టౌన్), న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లా వాసులతో పాటు పరిసర జిల్లాలు, జంట నగరాలు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున 5 గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.



దుర్గామాతకు ప్రత్యేక అలంకరణ





సీటు కోసం కిటికీలోంచి ప్రవేశించే ప్రయత్నం

ఎట్లయినా సరే.. ఊరికి పోవాలే..

మిలాద్ ఉన్ నబీ, రాఖీ పండుగలు, వారాంతం సెలవుల అనంతరం ఊళ్లకు వెళ్లేందుకు ప్రజలు అధిక సంఖ్యలో బస్టాండ్లకు వచ్చారు. సిద్దిపేట పట్టణంలోని మోడ్రన్ బస్టాండ్ వద్ద విపరీతమైన రద్దీ నెలకొంది. సీట్ల కోసం బాలలు బస్సు కిటికీలోంచి దూరారు.
– న్యూస్‌టుడే, సిద్దిపేట



బస్టాండు లోపలికి వెళ్లలేకుండా అడ్డంగా కారు

ఆలయం లేకున్నా.. జేబుల్లోకి 'ధూపదీపం' నిధులు?

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్

నిఘా

ఆదాయం లేని పురాతన ఆలయాలకు ధూపదీప నైవేద్యం పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. ఎంపిక చేసిన ప్రతి గుడికి నెలకు రూ.10వేలు అందజేస్తోంది. ఇందులో అర్చకుడికి గౌరవ వేతనంగా రూ.7వేలు, నిత్య కైంకర్యాలు, ఖర్చులకు రూ.3 వేలు వెచ్చిస్తున్నారు. పూజలకు నోచని చిన్న, పురాతన ఆలయాలను పరిరక్షించడం ఈ పథకం లక్ష్యం. ఇంత వరకు బాగానే ఉన్నా, ఆలయాల్లో పూజలు చేయకుండానే వేతనాలు తీసుకోవడం, స్థానికంగా ఉండకుండా, వారానికోసారి రావడం కొందరు చేస్తున్నారు. ధూపదీప నైవేద్యం పెట్టకుండా కొందరు నెలకు వచ్చే డబ్బులను తమ జేబులో వేసుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

974 మందిలో.. 96 మంది అనర్హులు

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 274 ఆలయాలున్నాయి. వీటిలో ఆదాయం వచ్చేవి 39 ఉన్నట్లుగా ఆశాఖ అధికారులు పేర్కొంటున్నారు. పథకం వర్తిస్తున్న ఆలయాలపై దేవాదాయ శాఖ మార్చి, ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సెర్ప్ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 974 మందికి రూ.10 వేలు మంజూరు చేస్తోంది. ఇందులో 96 మంది అనర్హులుగా తేల్చారు. నెలకు రూ.9.60 లక్షలు దుర్వినియోగం అయినట్లుగా తేల్చారు. ఇందులో కొంత మంది మృతి చెందిన వారు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. వారి స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించాలని పలువురు అర్చకులు కోరుతున్నారు. ఇందులో చాలా పల్లెల్లో, పట్టణాల్లో ఆలయాలు లేకున్నా, పూజలు చేయకున్నా చేసినట్లుగా పేర్లు నమోదు చేసి ఆయా నిధులను తీసుకుంటున్నట్లుగా విమర్శలున్నాయి.

ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటాం

96 మంది అనర్హులుగా తేలింది. అయితే ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు నడుచుకుంటాం. ధూపదీప నైవేద్యం సమర్పించకుండా, ఆలయాలు లేకున్నా ఉన్నట్లుగా నెలకు డబ్బులు తీసుకోవడం చట్టరీత్యా నేరం.
– విజయరామారావు, సహాయ కమిషనర్, దేవాదాయ శాఖ

జూనియర్ కళాశాలల్లో ఆధునిక అడుగులు

కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం

న్యూస్‌టుడే, సిద్దిపేట, సిద్దిపేట గ్రామీణ

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విద్యను చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతిష్ఠాత్మక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నూతనంగా కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఒక్కో కళాశాలకు రూ. 25 లక్షల చొప్పున నిధులను కేటాయించారు. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా నిధులను అందిస్తూ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మాణాలకు సంబంధించిన విధివిధానాలను స్పష్టం చేశారు.

సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు వస్తుంది

ఇప్పటికే ప్రభుత్వం వివిధ పద్ధతుల ద్వారా డిజిటల్ బోధన అందిస్తోంది. వీటికి అదనంగా కంప్యూటర్ ల్యాబ్‌లు వస్తే విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి పట్టు వస్తుంది. నైపుణ్యాలు గణనీయంగా పెరుగుతాయి.
–శ్రీనివాస్, ఇన్‌ఛార్జి డీఐఈవో, సిద్దిపేట

జిల్లాలోని కళాశాలలు: 20 ఎంపికైనవి: 3

మండలాల వివరాలివీ..

గజ్వేల్ బాలికలు, గజ్వేల్ బాలుర, జగదేవపూర్

నైపుణ్యాలకు పదును..

ప్రభుత్వ కళాశాలల్లో ఇంతకాలం కంప్యూటర్ బోధన పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలకు దూరమవుతూ వస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కళాశాలల్లో ఫిజిక్స్ వాలా ద్వారా ఐఐటీ, జేఈఈ కోచింగ్, ఖాన్ అకాడమీ ద్వారా క్లాట్ తరగతులను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తోంది. గతేడాది అన్ని కళాశాలలకు ఫ్లాట్ ప్యానెల్ బోర్డులను అందజేయడంతో డిజిటల్ బోధన ఊపందుకుంది. ఈ తరుణంలో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానంపై పూర్తి పట్టు సాధించేలా ప్రత్యేక ల్యాబ్‌ల నిర్మాణం ఎంతగానో దోహదపడుతుందని విద్యావర్గాలు భావిస్తున్నాయి. ఇదే స్ఫూర్తితో దశల వారీగా జిల్లాల్లోని మిగతా ప్రభుత్వ కళాశాలల్లోనూ కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని అధ్యాపకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

నిధులతో ఏం చేస్తారంటే..

ప్రత్యేకంగా గది ఏర్పాటు చేస్తారు. కంప్యూటర్లు, కూర్చునేందుకు వీలుగా కుర్చీలు, బల్లలు వంటి ఫర్నిచర్ అందిస్తారు. విద్యార్థులకు ఏఐ, తదితర వాటిని బోధిస్తారు. అన్ని వసతులు సమకూర్చిన తర్వాత అధ్యాపకులకు కంప్యూటర్ బోధనపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు.

పోలీస్ ఇంట్లో చొరబడిన దొంగ

పలు కాలనీల్లో చోరీ



సీసీ కెమెరాలో నిందితుడి చిత్రం

తూప్రాన్‌లో ఆదివారం తెల్లవారుజామున ఓ దొంగ హల్‌చల్ చేశాడు. పట్టణంలోని పోలీస్ కాలనీ, ఆదిత్యనగర్ కాలనీలోని ఇళ్లలోకి చొరబడ్డాడు. ఓ పోలీసు అధికారి ఇంట్లో ఉన్న స్కూటీని ఎత్తుకెళ్లాడు. సుమారు ఒక గంటకు పైగా కాలనీల్లోని పలు ఇళ్లలో చొరబడి ఆరబెట్టిన దుస్తులు, సామగ్రి అపహరించారు. ఉదయం గమనించిన యజమానులు స్కూటీ, సామగ్రి చోరీకి గురైందని గుర్తించారు. సీసీ కెమెరాలను పరిశీలించగా ఒక నిందితుడు దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. వరుస చోరీలో పట్టణవాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పోలీసులు రాత్రి పెట్రోలింగ్ పెంచి చోరీలకు అడ్డుకట్ట పడేలా చూడాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తూప్రాన్

'ఎల్లుండి నుంచి కాంగ్రెస్ వైఫల్యాలపై నిరసన'



భారాస నేతలతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సిద్దిపేట, చిన్నకోడూరు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వేయి రోజులు నిండుతున్న సందర్భంగా మోసాలను ప్రజల్లో ఎండగడతామని, ఈ మేరకు భారాస కార్యాచరణకు సిద్ధమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే కార్యాలయంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. భారాస శ్రేణులంతా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 100 రోజుల్లోనే హామీలు నెరువేరుస్తామని అధికారికంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసగించిదన్నారు. గోనెపల్లి, కస్తూరిపల్లి గ్రామాల్లో పలువురు మృతి చెందడంతో ఆయా కుటుంబ సభ్యులను హరీశ్‌రావు పరామర్శించారు.

- 2వ తేదీన .. కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ, ఫ్లెక్సీల ప్రదర్శన, రైతు కూలీలు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, యువతకు ఆర్థిక సాయం అంశాలు.
- 3న.. వ్యవసాయం, సాగునీటి రంగం విధ్వంసంపై..
- 4న .. పింఛనుదారులు, వృద్ధులు, దివ్యాంగులతో సదస్సుల నిర్వహణ, వంటావార్పు
- 5న .. జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ ప్రదర్శనలు
- 6న .. సిద్దిపేటలో ఆటో ర్యాలీ, గ్రామాల్లో నిరసన
- 7న .. ప్రజావాణి కార్యక్రమాల్లో 420 హామీల అమలుపై వినతిపత్రాల సమర్పణ.

సిరిధాన్యాల ఘుమఘుమలు


జొన్న రొట్టెలు.. మరోవైపు రాగి దోసెలు.. పక్కనే సజ్జల మురుకులు.. ఇంకో చోట చిరుధాన్యాల ఇడ్లీలు.. యువత అభిరుచికి తగ్గట్లు మిల్లెట్ వెజ్ బిర్యానీ.. ఇలా ఎటు చూసినా సిరిధాన్యాల ఘుమఘుమలే. ఒకప్పుడు ప్రతి ఇంటి కంచంలో కనిపించిన ఈ ఆహారమే, మళ్లీ మన వంటిళ్లలోకి అడుగు పెడుతున్న దృశ్యం జహీరాబాద్‌లో ఆవిష్కృతమైంది. దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) కార్యాలయం ఆవరణలో ఆదివారం ప్రపంచ చిరుధాన్యాల దినోత్సవాన్ని పురస్కరించుకుని సిరిధాన్యాల వంటల పోటీలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 100 మంది మహిళా రైతులు, విద్యార్థులు పాల్గొని చిరుధాన్యాలతో తయారు చేసిన 40కి పైగా రకాల వంటకాలను ప్రదర్శించారు.
–న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్, జహీరాబాద్



వంటకాలు ప్రదర్శిస్తున్న మహిళలు











(c) eenadu

మాకూ కావాలి.. ఓ అథారిటీ

• ఉమ్మడి జిల్లాలో నాలుగు ఏర్పాటుకు అవకాశం


సంగారెడ్డి ముఖ చిత్రం

ప్రజాప్రతినిధులు చొరవ చూపితేనే

రాజకీయాలకు అతీతంగా అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తీసుకొస్తేనే అథారిటీల ఏర్పాటుకు మార్గం సుగమం కానుంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లా కేంద్రంలో పర్యటించిన సమయంలో వీటి ఏర్పాటును ప్రకటిస్తారని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశించినా నిరాశే ఎదురైంది. -ఈనాడు, సంగారెడ్డి

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు పట్టణాలను మాస్టర్‌ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేసేందుకు ఉపయోగపడే అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరముంది. గత ప్రభుత్వ హయాంలో సిద్దిపేట జిల్లాలో సుడా, గజ్వేల్‌లో గడా పేరిట రెండు యూడీఏలు ఏర్పాటు చేశారు. రాజధానికి సమీపంలో ఉండడంతో ఉమ్మడి జిల్లాలోని సంగారెడ్డి, సిద్దిపేట, నర్సాపూర్, గజ్వేల్ పట్టణాలతో పాటు పారిశ్రామిక ప్రాంతమైన జహీరాబాద్‌లు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పట్టణాల పరిసర ప్రాంతాలను కలుపుకొని అథారిటీలు ఏర్పాటు చేస్తే సమీప ప్రాంతాలు ప్రగతిపథంలో పయనించనున్నాయి.

సుడాపై నిర్లక్ష్యం.. ప్రగతికి దూరం

గత ప్రభుత్వ హయాంలో సిద్దిపేట పట్టణంతో పాటు చుట్టూ 20 కి.మీ.ల పరిధిలోని గ్రామాలను కలుపుతూ సుడా(సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటు చేశారు. గత రెండున్నరేళ్ల నుంచి పాలకమండలితో పాటు పర్యవేక్షణకు అధికారిని నియమించడం లేదు. దీంతో ఈ ప్రక్రియ కాగితాలకే పరిమితం అయింది. ఇదే విధంగా గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటైన గడా భారాస అధికారం కోల్పోవడంతో రద్దయింది.

జోరుగా స్థిరాస్తి వ్యాపారం

రాజధానికి సమీపంలో ఉండడంతో సంగారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం జోరందుకుంది. దేశవిదేశాలకు చెందిన పేరొందిన సంస్థలు ఈ ప్రాంతంలో భూముల మీద పెట్టుబడులు పెడుతున్నాయి. స్థిరాస్తి వెంచర్లు ఏర్పాటు చేసి తమ వ్యాపార కార్యకలపాలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా కేంద్రంగా సంగారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఇదేవిధంగా జహీరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న నిమ్జ్(జాతీయ పెట్టుబడుల ఉత్పత్తి మండలి)లో పారిశ్రామిక స్మార్ట్ సిటీ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తోంది. ఈ క్రమంలోనే జహీరాబాద్‌తో పాటు సమీప గ్రామాలను కలుపుతూ జహీరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేస్తేనే ప్రణాళికయుతంగా పట్టణీకరణ జరగనుంది. నర్సాపూర్, గజ్వేల్ పట్టణాలకు అవకాశాలున్నాయి.

ఉపయోగాలు ఇలా..

• యూడీఏ ఏర్పాటైతే పట్టణ ప్రాంతాల సమగ్ర, క్రమబద్ధమైన అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి అమలు చేయొచ్చు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పట్టణాభివృద్ధి సంస్థల నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరవుతాయి.

• మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నివాసయోగ్యమైన పట్టణ జీవనాన్ని ప్రోత్సహించవచ్చు. మాస్టర్ ప్లాన్ రూపొందించి భూ వినియోగాన్ని నియంత్రించొచ్చు. • కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ వివిధ పథకాల ద్వారా లభించే నిధులతో కాలనీలు, శివారు గ్రామాల స్వరూపం మారుతుంది. ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేసి పెట్టుబడులను ఆకర్షించడంతో స్థానికంగా ఉపాధి పెరుగుతుంది.

మమ్మేలు.. కొమురవెల్లి మల్లన్న


అధికారులు, అర్చకులకు వెండి బిందె, చెంబు అందజేస్తున్న దాతలు


కొమురవెల్లి: ప్రసాదాల కోసం వరుసలో భక్తులు

చేర్యాల, న్యూస్‌టుడే: 'మొక్కులు తీర్చుకున్నం మల్లన్నా.. చల్లంగా దీవించన్నా..' అంటూ భక్తుల వేడుకోలుతో కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం ఆదివారం మార్మోగింది. శ్రావణ మాసం కావడంతో స్వామి దర్శనానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది. స్వామి దర్శన, ప్రసాదాల క్యూలైన్లలో భక్తులు బారులుదీరారు. మల్లన్న దర్శనానికి 3 గంటల సమయం పట్టింది. 37 కుటుంబాలు అభిషేకం నిర్వహించగా, 24 కుటుంబాల సభ్యులు మల్లికార్జునస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్నారని, 20 వేల మంది దర్శించుకున్నారని ఆలయ వర్గాలు తెలిపాయి. కొమురవెల్లికి చెందిన అంబటిపల్లి యాదలక్ష్మి కుటుంబ సభ్యులు సుమారు రూ.4 లక్షల విలువైన 1.876 కిలోల వెండితో తయారు చేయించిన బిందె, చెంబులను సమర్పించారు. ఆలయ పర్యవేక్షకుడు చంద్రశేఖర్, ప్రధానార్చకుడు మల్లికార్జున్, ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆంజనేయులుకు దాతలు అంబటిపల్లి మల్లికార్జున్, వెంకటనరేందర్, రాము అందించారు.

బీడీ కార్మికులకు జీవనభృతి అమలు చేయాలి: సీఐటీయూ


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బీడీ కార్మికులందరికీ జీవనభృతి రూ.4016 వెంటనే అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ డిమాండ్ చేశారు. సిద్దిపేట పట్టణంలోని విపంచి కళా నిలయంలో ఆదివారం నిర్వహించిన బీడీ సిగార్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో బీడీ పరిశ్రమపై ఆధారపడి సుమారు 7లక్షల మంది కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో. అధికారంలోకి వస్తే బీడీ కార్మికులందరికీ ప్రస్తుతం ఇస్తున్న భృతిని రూ.4016లకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించినప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కార్మికుల పింఛను రూ.7500లకు పెంచాలని, వెంటనే కనీస వేతనాల జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ, సీఐటీయూ నేతలు సుధాకర్, గోపాలస్వామి, భాస్కర్, శశిధర్, రవికుమార్, శోభ, కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో మెదక్ వాసి ప్రతిభ


అందుకున్న పతకాలు చూపిస్తున్న ప్రభు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీలు ఆదివారం హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగాయి. మెదక్ పట్టణానికి చెందిన కొక్కొండ ప్రభు 65 ఏళ్ల విభాగంలో పాల్గొని లాంగ్‌జంప్, షాట్‌పుట్‌లో తృతీయ స్థానంలో నిలిచారు. నిర్వాహకుల చేతుల మీదుగా పతకాలను అందుకున్నారు. మెదక్ జిల్లా క్రీడాకారులు, మాస్టర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్, రాజేందర్ తదితరులు ఆయన్ను అభినందించారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా క్రికెట్ ఎంపికలు


పాల్గొన్న క్రీడాకారులు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: సంగారెడ్డి పట్టణంలోని ఎంఎస్ క్రికెట్ మైదానంలో ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-16 ఎంపికలు ఆదివారం నిర్వహించారు. మూడు జిల్లాల నుంచి 124 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఉమ్మడి మెదక్ జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన వారు సెప్టెంబరు 7 నుంచి హైదరాబాద్‌లో నిర్వహించనున్న అండర్-16 టోర్నీలో పాల్గొనాల్సి ఉంటుందని ఉమ్మడి జిల్లా కార్యదర్శి రాజేందర్ రెడ్డి తెలిపారు.

నిధులు కేటాయిస్తేనే గుణాత్మక విద్య


మాట్లాడుతున్న విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆచార్య లక్ష్మీనారాయణ

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి నాణ్యమైన విద్య అందించాలని విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆచార్య లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సంగారెడ్డి పట్టణంలోని టీపీటీఎఫ్ భవన్‌లో 'ప్రభుత్వ బడుల బలోపేతం- ప్రభుత్వ బాధ్యత- మనకర్తవ్యం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యకు 20 శాతం నిధులు కేటాయిస్తేనే గుణాత్మక విద్య అందుతుందని తెలిపారు. 23 వేల బడులను మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయించడం సరికాదని పేర్కొన్నారు. విద్య ప్రైవేటీకరణ వల్ల ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు మూత పడుతున్నాయని ఆరోపించారు. సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు వై.అశోక్ కుమార్ మాట్లాడుతూ.. విద్యారంగాన్ని పరిరక్షించుకునేందుకు ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు ముందుకు రావాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ప్రధాన కార్యదర్శి రాంచందర్, ఎస్టీయూ రాష్ట్ర కోశాధికారి సయ్యద్ సాబేర్‌అలీ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాన్‌సింగ్, జిల్లా అధ్యక్షుడు దుర్గయ్య, యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

భూములు.. అధికారాలను లాక్కుంటారా?

• ఉత్తర్వులపై సర్పంచుల మండిపాటు • టీజీఐఐసీ, గ్రామీణాభివృద్ధి శాఖల నిర్ణయంపై నిరసనలు

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్, ఝరాసంగం, న్యాల్‌కల్: జహీరాబాద్ నిమ్జ్(జాతీయ ఉత్పాదక పెట్టుబడుల మండలి) ఏర్పాటు ప్రక్రియలో జారీ చేసిన కొత్త నిబంధన స్థానికంగా తీవ్ర ఆందోళనలకు దారితీస్తోంది. ఇప్పటికే సారవంతమైన భూములు కోల్పోయి రోడ్డున పడుతున్న రైతులకు తాజాగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు మరింత శరాఘాతంగా పరిణమించాయి. పరిశ్రమల పేరుతో భూములు సేకరించడమే కాకుండా స్థానిక గ్రామ పంచాయతీల అధికారాలను టీజీఐఐసీ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలకు బదలాయించాలంటూ జారీ అయిన సంయుక్త నోటిఫికేషన్ ఇప్పుడు చర్చనీయాంశమైంది. ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థుల హక్కులను కాలరాసేలా ఉన్న ఈ నిర్ణయంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

బదలాయింపుతో ఆదాయానికి గండి..

ఝరాసంగం మండలంలోని 3, న్యాల్‌కల్ మండలంలోని 14 గ్రామాల పరిధిలో నిమ్జ్ కోసం భూసేకరణ చేపడుతున్నారు. ఈ క్రమంలో టీజీఐఐసీ, పంచాయతీరాజ్ శాఖలు సంయుక్తంగా జారీ చేసిన నోటిఫికేషన్ స్థానిక సర్పంచులను విస్మయానికి గురిచేస్తోంది. సేకరించిన భూముల్లో భవిష్యత్తులో పరిశ్రమలు ఏర్పాటయ్యాక వచ్చే ఎలాంటి ఆదాయం ఆయా గ్రామ పంచాయతీలకు చెందకుండా నేరుగా టీజీఐఐసీకి జమయ్యేలా తీర్మానాలు పంపాలని ఆదేశించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇది పంచాయతీల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేలా ఉందని, సర్పంచులు, వార్డు సభ్యుల అధికారాలను లాక్కునే కుట్ర జరుగుతోందని ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకించిన 17 పంచాయతీలు అధికారాల బదలాయింపునకు వ్యతిరేకంగా ఇప్పటికే తీర్మానాలు చేయడం గమనార్హం.


ఎల్గోయిలో గ్రామసభ నిర్వహిస్తున్న పంచాయతీ పాలకులు

హామీల అమలు ఉత్తిమాటేనా..?

బాధితులకు పరిశ్రమల్లో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు స్థానిక గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సర్పంచులు డిమాండు చేస్తున్నారు. గతేడాది జహీరాబాద్‌లో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి భూ బాధితులకు ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ల హామీ ఇప్పటికీ నెరవేరలేదని ప్రజలు గుర్తుచేస్తున్నారు. తమ పొట్ట కొట్టి అధికారాలను లాక్కునే నిర్ణయాలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.

అదనపు సర్వే నంబర్ల కలకలం..

ఒకవైపు అధికారాల కోతతో సర్పంచులు రగిలిపోతుంటే.. మరోవైపు అదనపు సర్వే నంబర్ల చేరిక రైతుల్లో గుబులు పుట్టిస్తోంది. ఏడాదికి మూడు పంటలు పండే సారవంతమైన భూములు కోల్పోతున్న తరుణంలో ముందస్తు సమాచారం లేకుండా అదనంగా మరిన్ని సర్వే నంబర్లను జాబితాలో చేర్చడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఉన్న కొద్దిపాటి భూమిని లాక్కుంటే తమ బతుకులు వీధిన పడతాయని రైతులు వాపోతున్నారు. జాబితాలో చేరిన అదనపు సర్వే నంబర్లను వెంటనే తొలగించాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు టీజీఐఐసీ ఈడీ వీరారెడ్డిని కలిసి సమస్య వివరించారు.

ఉత్తర్వుల సమాచారం అందలేదు..

నిమ్జ్ భూసేకరణ గ్రామాల్లో పంచాయతీల అధికార బదలాంపులపై రెవెన్యూ శాఖకు ఉత్తర్వుల సమాచారం అందలేదు. భూసేకరణ సహా మిగతా వ్యవహారాలు నిమ్జ్ భూసేకరణ అధికారులు చూసుకుంటారు. - దేవుజా, ఆర్డీవో జహీరాబాద్

విద్యార్థి భవితకు.. విజ్ఞాన్ మంథన్

▲ సెప్టెంబరు 30వరకు దరఖాస్తులకు గడువు

జిల్లా	ఉన్నత పాఠశాలలు	విద్యార్థులు	కళాశాలలు	విద్యార్థులు
సిద్దిపేట	579	87,224	20	6,443
సంగారెడ్డి	211	67,500	20	6,400
మెదక్	156	28,636	16	5,669
వికారాబాద్	176	30,200	14	5,500

న్యూస్‌టుడే, సిద్దిపేట గ్రామీణం, సంగారెడ్డి మున్సిపాలిటీ, చేగుంట: విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ఆరో తరగతి నుంచి ఇంటర్ (11వ తరగతి) వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారు ఇస్రో, డీఆర్డీవో శాస్త్రవేత్తలతో నేరుగా సంభాషించే సువర్ణావకాశం కల్పిస్తోంది. ఈ క్రమంలోనే నగదు పురస్కారాలు, భాస్కర పేరిట ఉపకార వేతనాలు అందిస్తున్నాయి. విద్యార్థుల్లోని శాస్త్రీయ నైపుణ్యాన్ని గుర్తించి విజ్ఞానశాస్త్ర రంగంలో దేశ పురోగతిపై అవగాహన, ప్రయోగాలపై మక్కువ పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా విజ్ఞానభారతి, విజ్ఞాన ప్రసార్, ఎన్సీఈఆర్టీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థి విజ్ఞాన్ మంథన్(వీవీఎం) పేరిట ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నారు.

అర్హులు.. నమోదు ఇలా..

6 నుంచి 11వ తరగతులు చదువుతున్న విద్యార్థులు అర్హులు. రూ.200 ఫీజు చెల్లించి సెప్టెంబరు 30వ తేదీలోపు అధికారిక వెబ్‌సైట్ https://vvm.org.in ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్ విధానంలో తెలుగు, ఆంగ్లం, హిందీతో పాటు ఇతర ప్రధాన ప్రాంతీయ భాషల్లో పరీక్ష ఉంటుంది. వెబ్‌సైట్ లేదా చరవాణి యాప్ ఆధారితంగా పరీక్ష రాయొచ్చు. జూనియర్ విభాగంలో 6, 7, 8 తరగతులు, సీనియర్ విభాగంలో 9, 10, 11 తరగతులు ఉంటాయి. చరవాణి, ట్యాబ్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ ఏదైనా వినియోగించి పరీక్ష రాయొచ్చు.

ఇవీ ప్రయోజనాలు...

పోటీలు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉంటాయి. రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు పురస్కారం, ప్రశంసా పత్రాలు అందజేస్తారు. జాతీయస్థాయి క్యాంపులు, శ్రీజాన్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం కింద ఇస్రో, డీఆర్డీవో, సీఎస్ఐఆర్, బీఏఆర్సీ వంటి ప్రముఖ పరిశోధన సంస్థల శాస్త్రవేత్తలతో నేరుగా సంభాషించడం, శిక్షణ పొందే అవకాశం లభిస్తుంది. విజేతలకు భాస్కర పేరిట ఉపకార వేతనాలు, ప్రముఖ సైన్స్ ప్రయోగశాలలు సందర్శించే అవకాశం కల్పిస్తారు. విద్యార్థుల భవిష్యత్తుకు విజ్ఞాన్ మంథన్ ఎంతో ఉపయోగపడుతుందని, దీనిపై పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులకు అవగాహన కల్పించాలని సిద్దిపేట డీఈవో రమేశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



చేర్యాల, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. చేర్యాలకు చెందిన యాంసాని పాండు, **వసంత** (59) ద్విచక్రవాహనంపై శనివారం సిద్దిపేటకు వెళ్లి తిరిగి ఆదివారం ఇంటికి వస్తున్నారు. కొమురవెల్లి ఠాణా పరిధిలోని గుర్జకుంట క్రాస్‌రోడ్డు వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ప్రమాదంలో పాండుకు స్వల్ప గాయాలు కాగా, వసంత తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడ్నుంచి సిద్దిపేటకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

ముడిసరకొచ్చింది.. ఇక్కత్ గిరాకీ పెరిగింది


దారాల నుంచి బీమ్‌లు పోస్తూ..

దుబ్బాక, న్యూస్‌టుడే: చేనేత సహకార సంఘం ఎన్నికలు పూర్తయి పాలకమండలి ఏర్పడటంతో వస్త్రాల తయారీ.. గిరాకీకి తగినట్టుగా సంస్థలకు అందించే పనుల్లో నేతకార్మికులు నిమగ్నమయ్యారు. రూ.8 లక్షల విలువైన ముడి సరుకు వచ్చింది. ప్రతి నెలా ఆర్డర్లను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రాంతంలో ప్రస్తుతం తక్కువ సంఖ్యలో చేనేత కార్మికులు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. విభిన్న రంగుల్లో కాటన్, జరీ, పట్టు చీరలతో పాటు ఇక్కత్ చీరలు, లెనిన్ కాటన్ వస్త్రాలను తయారు చేస్తున్నారు. దుబ్బాక చేనేత సొసైటీలో ప్రస్తుతం 40 మగ్గాలతో 36 మంది కార్మికులు పోచంపల్లి ఇక్కత్ చీరలు, కాటన్ టవల్స్, బెడ్‌షీట్స్ వంటివి నేస్తున్నారు. మరో 15 మంది కండెలు చుట్టడం, బీమ్‌లు పోయడం, నింపడం చేపడుతున్నారు.

దుబ్బాక సొసైటీ పనులు, ప్రణాళిక

◆ 8 మగ్గాలపై పోచంపల్లి ఇక్కత్ చీరలు తయారుచేస్తారు. ◆ 25 మగ్గాల మీద రోజూ 200 కాటన్ తువ్వాళ్లు ◆ సీతాకోకచిలుక, శంఖం, పూల ఆకృతుల్లో ఇక్కత్ చీర తయారవుతుంది. ◆ కార్మికులంతా రోజూ 6 చీరలు నేస్తున్నారు. ◆ ఖర్చులు రూ.2500; తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంఘం (టెస్కో) కొనుగోలు ధర రూ.2800 ఉంటోంది. ◆ తువ్వాలు ఒక్కంటికి రూ.160 ఖర్చు; టెస్కో కొనుగోలు ధర రూ.180 ఉంటోంది. ◆ జకార్డు మగ్గాలు కేవలం 2 ఉన్నాయి. ఇటీవల మరొకటి కొనుగోలు చేశారు. ◆ ప్యూర్ పట్టు.. కాటన్ జరీ.. గొల్లభామ చీరల తయారీ స్వల్పం. ◆ రూ.8 లక్షలతో ముడిసరుకు కొన్నారు. కార్మికుల 3 నెలల వేతనాలు సైతం సొసైటీ చెల్లించింది.

విలువైన పట్టు జరీ చీరలు సైతం తయారుచేస్తాం..

చేనేత కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ఉపాధికి అండగా నిలుస్తున్నాం. అన్ని రకాల ఆకృతులతో, విభిన్న రంగుల్లో నేస్తున్న పోచంపల్లి ఇక్కత్ చీరలు, కాటన్ టవల్స్‌కు గిరాకీ పెరిగింది. త్వరలోనే అధిక ధర కలిగిన పట్టు జరీ చీరలను నేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

-అంకం మధు, దుబ్బాక చేనేత సహకార సొసైటీ ఛైర్మన్

మార్జాలంపై మమకారం

• గాయపడిన పిల్లికి శస్త్రచికిత్స చేయించి కాపాడిన జూనియర్ అసిస్టెంట్



న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం: తీవ్రంగా గాయపడిన పిల్లి పిల్లకి శస్త్రచికిత్స చేయించడమే కాకుండా రోజూ అవసరమైన సపర్యలు చేస్తున్నారు.. ఆయనే సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల పరిషత్తు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కొండం తిరుమల్‌రెడ్డి. జనగామ జిల్లా తరిగొప్పుల గ్రామం ఆయన సొంతూరు. మూడు నెలల క్రితం తరిగొప్పులలోని ఆయన ఇంట్లో ఓ పిల్లి పిల్లలను పెట్టింది. 15 రోజుల తర్వాత అందులోని ఓ పిల్లికూన ఇంటి ముందు రోడ్డుపై వెళ్తుండగా కుక్క దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన పిల్లి కూన వెనుక రెండు కాళ్లు దెబ్బ తిని నడవలేక పోయింది.

వదిలేయలేదు

గమనించిన తిరుమల్‌రెడ్డి ఊరకే వదిలేయకుండా పిల్లి పిల్లను ఇంట్లోకి తెచ్చారు. సమీపంలోని ప్రభుత్వ పశువైద్యశాలకు తీసుకువెళ్లి చూపించగా పరీక్షించిన వైద్యులు అది బతకడం కష్టమని వదిలేయమని సలహా ఇచ్చారు. ఆయన దానిని వదలేయలేదు. అక్కడి నుంచి వరంగల్‌లోని పశు వైద్యశాలలో చికిత్స చేయించారు. కాస్త కోలుకున్నా నడవలేక పోయింది. తర్వాత హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని వెటర్నరీ యూనివర్సిటీకి తీసుకువెళ్లి అక్కడి వైద్యులకు చూపించారు. వారు సర్జరీ చేయాలని చెప్పి కొన్ని మందులు సూచించారు. రెండు రోజుల అనంతరం హనుమకొండలోని ప్రైవేటు పశువైద్యశాలలో చూపించారు. వైద్యులు పలు పరీక్షలు చేసి పిల్లికి నడుముతో పాటు కాళ్లకు శస్త్రచికిత్స చేశారు. బాగా దెబ్బతిన్న ఒక కాలును తొలగించారు. ప్రస్తుతం ఇంట్లో ప్రత్యేక బోనులో ఉంచి ఆయన సంరక్షిస్తున్నారు. ఇన్‌ఫెక్షన్ కాకుండా ఉండటానికి దాని మెడకు కాలర్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మూడు కాళ్లతో నిలబడుతూ మెల్లగా నడవడానికి యత్నిస్తోంది. వైద్యం కోసం ఆయన ఇప్పటికే రూ.50 వేలు ఖర్చు చేశారు. ఇంజక్షన్లు, యాంటీబయాటిక్స్ మందులు, పాలు, ఇతర ఆహారం తదితరాలకు రోజూ రూ.200 ఖర్చవుతున్నట్లు తిరుమల్‌రెడ్డి తెలిపారు. గాయం పూర్తిగా మానిన తర్వాత కృత్రిమ కాలు కోసం ప్రయత్నిస్తానన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వివాహిత దుర్మరణం



రాయపోల్, న్యూస్‌టుడే: ఎదురెదురుగా వస్తున్న రెండు దిచక్ర వాహనాలు ఢీకొని మహిళ దుర్మరణం చెందింది. భర్తకు గాయాలయ్యాయి. మరో వాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తికి గాయాలు కాలేదు. ఎస్ఐ మానస తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం తిమ్మక్‌పల్లి గ్రామానికి చెందిన దంపతులు ఉడిది రామస్వామి, **అమృత** (48) వ్యవసాయం పనులు చేస్తుంటారు. శనివారం ఉదయం తమ ద్విచక్ర వాహనంపై పొలానికి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి బయలు దేరారు. రాయపోల్ నుంచి దౌల్తాబాద్ వైపు వెళ్తున్న మరో వాహనం ఢీకొట్టింది. రామస్వామి కాళ్లకు, భార్య అమృత తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా దారిలో ఆమె మృతి చెందింది. కుమార్తె మరియ ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు దగ్ధం.. తప్పిన ప్రమాదం


దగ్ధమవుతున్న కారు

చేగుంట, న్యూస్‌టుడే: కారులో ఒక్కసారిగా మంటలు ఎగసి పడి త్రుటిలో ప్రమాదం తప్పిన ఘటన మెదక్ జిల్లా చేగుంట సమీపంలోని 44వ జాతీయ రహదారి బైపాస్‌లో ఆదివారం చోటుచేసుకుంది. కామారెడ్డి జిల్లా భిక్కనూరుకు చెందిన మనోజ్, మీనాక్షితో పాటు మరొకరు కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. చేగుంట బైపాస్ సర్కిల్ వంతెనపైకి రాగానే పొగలు వచ్చాయి. వంతెన దిగిన తర్వాత కారును పక్కకు ఆపి అందులో ప్రయాణిస్తున్న వారు దిగి బ్యానెట్ తెరిచి చూస్తుండగానే మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. గ్యాస్‌తో నడిచే కారు కావడంతో షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు చెలరేగి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. రామాయంపేట నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలు ఆర్పివేసింది. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది.

చికెన్ ధరలు			
ఫాంరేటు	117-00	డ్రెస్డ్	223-00
రిటైల్	144-00	స్కిన్‌లెస్	252-00

టీపీఎస్‌లుగా ఆదర్శ పాఠశాలలు

• గ్రామీణ విద్యార్థులకు వరం


సంగారెడ్డి జిల్లాలోని మోర్గి పాఠశాల

న్యూస్‌టుడే, మనూరు: గ్రామీణ పేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమ విద్య అందించేందుకు ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను నెలకొల్పింది. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు కొనసాగుతున్నాయి. సత్ఫలితాలు వస్తుండటంతో వాటిని తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల(టీపీఎస్)గా మార్చాలని ప్రభుత్వం యోచిస్తోంది. పూర్వ ప్రాథమిక విద్య నుంచి అయిదో తరగతి వరకు ప్రవేశపెట్టేలా చర్యలు చేపట్టింది. ఇప్పటికే రాష్ట్ర పరిశీలకులు శ్రీనివాసచారి ఆధ్వర్యంలోని బృందం పాఠశాలలను సందర్శించి నివేదికలను రూపొందించింది.

మూడు జిల్లాల్లో ఇలా..

రాష్ట్ర వ్యాప్తంగా 194 ఆదర్శ పాఠశాలలున్నాయి. ఇందులో ఉమ్మడి మెదక్ జిల్లాలో 31 ఉన్నాయి. 2026-27 విద్యా సంవత్సరంలో ప్రీప్రైమరీ పాఠశాలలను ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. ఇటీవల రాష్ట్ర బృందం సభ్యులు పాఠశాలలను సందర్శించి సౌకర్యాలు, తదితర వివరాలపై ఆరా తీశారు. ప్రస్తుతం ఆదర్శ పాఠశాలల్లో వంద మంది ఇంటర్ బాలికలకు మాత్రమే వసతి గృహ సౌకర్యం కల్పిస్తున్నారు. ప్రీప్రైమరీ (నర్సరీ) నుంచి 5వ తరగతి వరకు ప్రవేశపెట్టి.. మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే అందులో చేరిన విద్యార్థి ఇంటర్ వరకు చదువుకోవచ్చు. అంతేకాదు టీపీఎస్‌లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనంతో పాటు సాయంత్రం స్నాక్స్ అందిస్తారు. దీంతో ఆకలి బాధలు సైతం ఉండవు. ప్రత్యేకంగా బస్సు సౌకర్యం కల్పిస్తే ఇంటి నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఇది పేద విద్యార్థులకు వరంగా మారనుంది.

రెట్టింపు దరఖాస్తులు వస్తున్నాయి

పూర్వ ప్రాథమిక పాఠశాల విద్య అందుబాటులోకి వస్తే విద్యార్థులకు మేలు చేకూరుతుంది. ఇప్పటికే ఏటా ప్రవేశాల కోసం రెట్టింపు దరఖాస్తులు వస్తున్నాయి. టీపీఎస్‌గా మారితే మరింత డిమాండు పెరుగుతుంది.

-సువర్ణ, ప్రిన్సిపల్ ఆదర్శ పాఠశాల, మోర్గి, సంగారెడ్డి జిల్లా

ఆదర్శ పాఠశాలల వివరాలు

సంగారెడ్డి: మోర్గి, అక్సాన్‌పల్లి, బస్వాపూర్, బొల్లారం, మాచునూర్, ఝరాసంగం, మునిపల్లి, పోతులబొగుడ, రాయికోడ్, వెలిమెల

మెదక్: చేగుంట, జక్కపల్లి, కోమట్‌పల్లి, రేగోడ్, పెద్దశంకరంపేట, టేక్మాల్, తిర్మలాపూర్

సిద్దిపేట: బెజ్జంకి, హుస్నాబాద్, సముద్రాల, నంగునూరు, మిరుదొడ్డి, ఇర్కోడ్, లచ్చపేట, చిన్నకోడూరు, జగదేవపూర్, కొండపాక, ముబ్రాజ్‌పల్లి, దౌల్తాబాద్, చేర్యాల, మద్దూరు

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు రిఫరీగా అందోలు వాసి


తరుణ్‌రాజ్, పీఈటీ

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో జూన్ 8 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన అమ్‌ట్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏకేఎఫ్ఐ) జాతీయ కబడ్డీ పోటీల రిఫరీ(న్యాయ నిర్ణేత) పరీక్షలో సంగారెడ్డి జిల్లా అందోలు గ్రామానికి చెందిన తరుణ్‌రాజ్ ఉత్తీర్ణత సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. కబడ్డీ కోచ్‌గా సేవలందిస్తూ జాతీయ స్థాయి పోటీలకు రిఫరీగా అర్హత సాధించడంపై అందోలు క్రీడాభివృద్ధి కమిటీ, జిల్లా క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తరుణ్‌రాజ్ సంగారెడ్డి మహాత్మా జ్యోతిబా ఫులే గురుకుల పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్నారు.

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా

సిద్దిపేట 9963585053
జగదేవపూర్ 8008573209
హుస్నాబాద్ 8008573520
దుబ్బాక 9030037175
చేర్యాల 8008574871
గజ్వేల్ 9490675047 (10AM TO 1 PM)

బెజ్జంకి, న్యూస్‌టుడే: ? ముత్తన్నపేట రహదారి కూడలి సమీపంలో రోడ్డుపై లోతైన గుంత ఏర్పడింది. కంకర తేలి విస్తరించగా వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. – **సురేష్, గ్రామస్థుడు**

✓ పరిశీలించి మరమ్మతు పనులు చేపడతాం. – **ప్రవీణ్, ఎంపీడీవో**

? లక్ష్మీపూర్‌లో ప్రధాన బస్టాండ్ నుంచి ఊరి చివరి వరకు రోడ్డుపై కందకాలు తవ్విన మట్టి పేరుకుపోయి వర్షాలకు బురదమయమైంది. రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. – **రవి, గ్రామస్థుడు**

✓ చదును చేసి బురద తొలగిస్తాం. – **కిషన్, పంచాయతీ కార్యదర్శి**

? మండల కేంద్రంలో కుక్కల బెడద తీవ్రమవుతోంది. వృద్ధులు, చిన్నారులు బయటికి రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు. – **మల్లేశం, గ్రామస్థుడు**

✓ కుక్కల సంచారాన్ని నివారించేందుకు గ్రామసభలో చర్చించాం. త్వరలోనే సమస్య పరిష్కరించి ఇబ్బందులు లేకుండా చూస్తాం. – **ప్రణీత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి**

దౌల్తాబాద్, న్యూస్‌టుడే: ? దౌల్తాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం పక్కనే ఉన్న కాలువలో మురుగు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. వెంటనే శుభ్రం చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి. – **సంతోష్, దౌల్తాబాద్**

✓ కాలువలో పేరుకుపోయిన మురుగు తొలగించి సమస్య పరిష్కరిస్తాం. – **గఫూర్, ఎంపీవో, దౌల్తాబాద్**

దారులు విస్తరించి.. నియంత్రికలు విస్మరించి

పల్లెల్లో రోడ్డుపక్కన ప్రమాదకరంగా మారిన వైనం

న్యూస్‌టుడే, జగదేవపూర్, కొండపాక గ్రామీణం, చిన్నకోడూరు: ప్రస్తుతం ఏ పని చేయాలన్నా విద్యుత్తు ఎంతో కీలకంగా మారింది. కానీ చాలా చోట్ల నియంత్రిక నిర్వహణ అధ్వానంగా మారింది. పొలాల్లో, రోడ్ల వెంట, ఆవాసాల నడుమ నియంత్రికలు ప్రమాదకరంగా ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



దుద్దెడ నుంచి బందారం వెళ్లే మార్గంలో..

దారికి ఏడడుగుల దిగువన..

రహదారి విస్తరణలో ఓ నియంత్రిక పూర్తిగా లోతట్టులో కూరుకుపోతోంది. దాదాపు 7 అడుగుల దిగువన ఉండడం వల్ల స్పష్టంగా చూస్తే తప్ప అది ఎక్కడుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు జంకుతున్నారు. జగదేవపూర్ మండలం వట్టిపల్లి నుంచి సాల్వాపూర్ వరకు ర.భ. శాఖ అధికారులు రహదారి విస్తరణ పనులు చేపట్టారు. రానున్న 20 ఏళ్లను దృష్టిలో ఉంచుకొని రహదారిని చాలా ఎత్తులో నిర్మించారు. దీంతో పక్కనే ఉన నియంత్రిక పూర్తిగా లోతట్టులోకి ఉంది. అటుగా వెళ్లే మూగజీవాలు, రాత్రి వేళల్లో వాహన చోదకులు ప్రమాదానికి గురయ్యే అవకాశముంది. విద్యుత్తుశాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని నియంత్రికను ఎత్తులోకి మార్చాలని కోరుతున్నారు.



వట్టిపల్లి సమీపంలో నియంత్రిక దుస్థితి

వాహనదారుల ఆందోళన

కొండపాక మండలం దుద్దెడ గ్రామం నుంచి బందారం వెళ్లేదారిలో రోడ్డు పక్కనున్న విద్యుత్తు నియంత్రిక వాహనదారుల పాలిట ప్రమాదకరంగా మారింది. గతంలో ఒకే వరుసగా ఉన్న ఈ రోడ్డును ఇటీవల రెండు వరుసలుగా విస్తరించారు. దీంతో తారురోడ్డు అంచున నియంత్రిక ఉండడంతో ఈ దారిలో వెళ్లే వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి నియంత్రికను రోడ్డుకు దూరంగా తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

వానొస్తే తీగలపై మంటలు

చిన్నకోడూరు మండలంలోని మెట్టుపల్లి పల్లె ప్రకృతివనంలో ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు విద్యుత్తు తీగలకు తగలడంతో ప్రమాదకరంగా మారింది. వర్షాలు, ఈదురు గాలుల సమయంలో తీగలకు చెట్ల కొమ్మలు తగిలి మంటలు వస్తున్నాయి. తరచూ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెట్ల కొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.



బడి ఆవరణ.. అపరిశుభ్రతతో యాతన

ప్రజ్ఞాపూర్‌లోని ప్రభుత్వ బాలికల పాఠశాల ఆవరణ పూర్తిగా మొక్కలు, బురదతో నిండిపోయింది. విషకీటకాలతో విద్యార్థులు నిత్యం భయాందోళన చెందుతున్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రం ఒకే ఆవరణలో ఉన్నాయి. ఇక్కడ మొత్తం 250 మంది వరకు విద్యార్థులున్నారు. ఆవరణ అంతా నీరు నిలవడంతో పిల్లలు ఆటలు ఆడుకోలేకపోతున్నారు. మైదానాన్ని చదును చేసి అభివృద్ధి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గజ్వేల్

భక్తిశ్రద్ధలతో బోనాల ఊరేగింపు

హుస్నాబాద్, హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: అక్కన్నపేట మండలం అంతకపేట, మోత్కులపల్లి, హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామాల్లో, హుస్నాబాద్ పట్టణంలో బోనాల పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, బైండ్లవారి విన్యాసాలతో ఊరేగింపు నిర్వహించారు. పోచమ్మతల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పిల్లాపాపలు, పాడిపంటలను చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



అంతకపేటలో పోచమ్మ ఆలయానికి వెళ్తున్న మహిళలు



వల్లంపట్లలో పోతరాజుల విన్యాసం

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: కుకునూరుపల్లిలో పోచమ్మ, ముత్యాలమ్మకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు ఆదివారం బోనాలు సమర్పించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు తదితరులు ఉన్నారు.

నంగునూరు, న్యూస్‌టుడే: సిద్దన్నపేటలో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బీరప్ప బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.

జగదేవపూర్, మద్దూరు, న్యూస్‌టుడే: జగదేవపూర్‌లో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మతల్లికి, మద్దూరు మండలం వల్లంపట్లలో గొల్ల, కురుమసంఘం ఆధ్వర్యంలో బీరప్ప చౌడాలమ్మతల్లికి బోనాలు సమర్పించారు.

‘కలుషిత జలాలు వదులుతున్నా చర్యలు తీసుకోరా?’

బెజ్జంకి, న్యూస్‌టుడే: గుగ్గిళ్ల, పోతారం శివారులోని ఇథనాల్ పరిశ్రమల నుంచి కలుషిత జలాలు ఇష్టానుసారంగా సాగునీటి కాలువల్లోకి వదులుతున్నా చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనుకడుగు వేస్తున్నారని అఖిలపక్షం నాయకులు ఆరోపించారు. ఆదివారం భారాస, సీపీఎం, భాజపా, డీఎస్పీ, సీపీఐ పార్టీల నాయకులు దాచారం శివారులోని కాలువలోకి చేరిన పరిశ్రమల కలుషిత జలాలను పరిశీలించారు. కాలువలు, చెక్‌డ్యాంల్లోని చేపలు మృతిచెందుతున్నా అధికారులు స్పందించడం లేదని, కొద్ది రోజుల క్రితం తహసీల్దార్ కార్యాలయం ముట్టడి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా కాలుష్య నియంత్రణ మండలి, నీటిపారుదల, మత్స్యశాఖ, తదితర విభాగాల అధికారులు కనీసం విచారణ చేపట్టకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భారాస, భాజపా మండల అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, రాజు, సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు శ్రీనివాస్, రూపేష్, భాజపా కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, డీఎస్పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సురేష్, శేఖర్‌బాబు, మహేష్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



కాలువలోని కలుషిత జలాలను పరిశీలిస్తున్న పలు పార్టీల నాయకులు

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: సిద్దిపేటలోని 132/33 కేవీ విద్యుత్తు ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా పట్టణంలోని ఖాదర్‌పుర, నసీర్‌నగర్, ఎల్లారెడ్డినగర్, సీతారాంనగర్, గ్రీన్ కాలనీ, నాగదేవత ఆలయం ఎక్స్‌రోడ్డు, గాడిచర్లపల్లి, రాఘవేంద్రనగర్, ఇందిరానగర్, వడ్డెర కాలనీ, కాళ్లకుంటకాలనీ, మెదక్‌రోడ్డు, కంచరిబజార్, బురుజు, సుభాష్‌రోడ్డు, పాత బస్టాండు, మోహినిపుర, గాంధీరోడ్డు, మంగమ్మతోట, చార్వదాన్, బారాఇమాం, నాసర్‌పుర, పాతమార్కెట్, కప్పలకుంట కాలనీల్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి 10.30 వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ రామచంద్రయ్య తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మారథాన్‌లో హుస్నాబాద్ వాసుల ప్రతిభ

హుస్నాబాద్ గ్రామీణం: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన మారథాన్‌లో హుస్నాబాద్‌కు చెందిన పలువురు రన్నర్లు ప్రతిభ కనబరిచారు. ఎన్ఎండీసీ ఆధ్వర్యంలో పరుగు పోటీలు నిర్వహించారు. అందులో హుస్నాబాద్‌కు చెందిన పోలు శంకర్, పంతం నవీన్, ఆకునూరి రాజు, బత్తుల మహేందర్, బోయిని పృథ్వీ, బత్తుల శ్రీనివాస్, అమ్మిగల్ల రమేశ్‌లు మారథాన్(42 కి.మీ.) విభాగంలో పాల్గొని విజయవంతంగా పూర్తిచేసి పతకాలు అందుకున్నారు.

ఉపాధి కల్పించే వరకు పోరాడదాం

చేర్యాల, న్యూస్‌టుడే: ప్రభుత్వాలు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించే వరకు పోరాటాలు సాగిద్దామని, అందుకు యువత ముందు వరుసలో నిలబడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ పిలుపునిచ్చారు. చేర్యాలలోని ఓ వేడుక మందిరంలో నిర్వహించిన ‘యువ కమ్యూనిస్టు’ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. సమావేశంలో దాసరి ప్రశాంత్, ఆముదాల రంజిత్‌రెడ్డి, బత్తుల అభిషేక్ భాను, ఆముదాల మల్లారెడ్డి తదితరలున్నారు.

శివాజీసేన జిల్లా అధ్యక్షుడిగా మహేశ్



సిద్దిపేట, న్యూస్‌టుడే: శివాజీసేన జిల్లా అధ్యక్షుడిగా చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ గ్రామానికి చెందిన **నాయకం మహేశ్** నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు తోట మధుకర్ ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ.. యువత భాగస్వామ్యం పెంచి సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆరుబయట చెత్త వేస్తే జరిమానా

సిద్దిపేట, న్యూస్‌టుడే: శతశాతం స్వచ్ఛతకు ప్రజలు సహకరించాలని, ఆరుబయట చెత్త (బ్లాక్‌స్పాట్) పారబోయవద్దని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ కోరారు. ఆదివారం పట్టణంలో సైకిల్‌పై తిరుగుతూ వివిధ ప్రాంతాలను పరిశీలించారు. శివారులో చెత్తను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా చెత్త పారబోస్తున్న వారిని గుర్తించి జరిమానా విధించాలని సూచించారు.



చెత్తను తొలగింపజేస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్

ఉపకులాల అభివృద్ధే లక్ష్యం: ఎమ్మార్పీఎస్

జగదేవపూర్, న్యూస్‌టుడే: మాదిగ, దాని ఉపకులాల అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ కృషి చేస్తోందని జిల్లా బాధ్యుడు మందకుమార్ మాదిగ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన మండల స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఎమ్మార్పీఎస్, దాని అనుబంధసంఘాల కార్యవర్గాలను ఎన్నుకున్నారు. జిల్లా సహబాధ్యులు మల్లిగారి యాదగిరి మాదిగ, ముక్కపల్లి రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మందకుమార్ మాదిగ

గోడపత్రికల ఆవిష్కరణ

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: వచ్చే నెల 18, 19, 20 తేదీల్లో సంగారెడ్డి జిల్లాలో నిర్వహించనున్న యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్లాపురం మధు పిలుపునిచ్చారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో ప్లీనరీ సమావేశాల గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శేఖర్, కార్యదర్శి రవి తదితరులు ఉన్నారు.

నేడు నియోజకవర్గ స్థాయి సమావేశం: భారాస

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి భారాస ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై సెప్టెంబరు 2 నుంచి 9 వరకు నిర్వహించనున్న కార్యక్రమాలపై పార్టీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ చర్చిస్తారన్నారు.

పాఠాలు బోధిస్తూ.. వీడియోతో అవగాహన కల్పిస్తూ



హుస్నాబాద్‌లోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పుస్తకాల్లోని పాఠ్యాంశాలు విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా కంప్యూటర్లను ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల పాఠశాలకు 4 కంప్యూటర్లతో పాటు టీ-ఫైబర్ ద్వారా అంతర్జాల సదుపాయాన్ని ఉచితంగా అందించింది. ఉపాధ్యాయులు పుస్తకాల్లోని పాఠ్యాంశాలను బోధించడంతో పాటు వాటికి సంబంధించి ఆన్‌లైన్‌లో ఉన్న వీడియోలను కంప్యూటర్ల ద్వారా విద్యార్థులకు చూపిస్తున్నారు. దీని ద్వారా పాఠ్యాంశాలపై పిల్లలు ఆసక్తి చూపడంతో పాటు త్వరగా అర్థం చేసుకుంటున్నట్లు ప్రధానోపాధ్యాయుడు లింగన్న తెలిపారు. – న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం

‘హలో మాదిగ చలో సిద్దిపేట’ను జయప్రదం చేయండి

నంగునూరు, న్యూస్‌టుడే: సెప్టెంబర్ 3న తలపెట్టిన ‘హలో మాదిగ చలో సిద్దిపేట’ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధికార ప్రతినిధి దేవులపల్లి రాజేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన నంగునూరులో మాట్లాడుతూ.. ఎస్సీ కార్పొరేషన్ నిధులను ఎస్సీలకే కేటాయించాలని, పారిశుద్ధ్య కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి వారికి నెలకు రూ.25 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 3న సిద్దిపేటలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మూడు రోజుల శిక్షణకు సర్పంచుల ఎంపిక



వెన్న స్వర్ణలత



ఎం.నవీన

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: హుస్నాబాద్ మండలం మాలపల్లి సర్పంచి వెన్న స్వర్ణలత, కొండపాక సర్పంచి ఎం.నవీన హైదరాబాద్‌లో జరిగే మూడు రోజుల శిక్షణకు ఎంపికయ్యారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో మహిళా సర్పంచులకు ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు ‘కెపాసిటీ బిల్డింగ్ ఫర్ గ్రామసభ’ అనే అంశంపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణకు జిల్లాకు ఇద్దరు మహిళా సర్పంచుల చొప్పున రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఎంపిక చేశారు. ఇందులో పాల్గొనేందుకు తమకు అవకాశం కల్పించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేస్తూ అధికారులు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

1 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని పాఠశాల విద్యార్థులకు ఎస్‌జీఎఫ్ (2026) మండల స్థాయి క్రీడా పోటీలను సెప్టెంబరు 1 నుంచి 3వరకు నిర్వహించనున్నట్లు ఎంఈవో రాజప్రభాకర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సుజాత ఆదివారం తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో సెప్టెంబరు 1న బాలికల వాలీబాల్, బాలుర ఖో-ఖో, 2న బాలుర వాలీబాల్, బాలికల ఖో-ఖో, 3న బాలబాలికలకు కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. పోటీల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు.

కోహెడ, న్యూస్‌టుడే: కోహెడలో సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మండల స్థాయి టోర్నమెంట్‌తో పాటు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో రాళ్లబండి పద్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని తెలంగాణ రెసిడెన్షియల్‌లో పోటీలు ఉంటాయని చెప్పారు.

అందరి భాగస్వామ్యంతోనే దేశప్రగతి

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: హుస్నాబాద్ మండలం నాగారంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ‘మన్ కీ బాత్’ కార్యక్రమం వీక్షించారు. ఆదివారం పార్టీ కార్యకర్త పాపరవేని రాకేశ్ ఇంట్లో ఏర్పాటు చేసిన టీవీ ద్వారా ప్రధాని ప్రసంగాన్ని గ్రామస్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా విన్నారు. దేశ అభివృద్ధి, యువతకు అవకాశాలు, స్వచ్ఛత, స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహం, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై ప్రధాని ప్రసంగిస్తూ దేశ ప్రగతిలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. గ్రామశాఖ అధ్యక్షుడు కొలిపాక కిరణ్, నాయకులు బత్తుల సంతోష్, వెంకటేశ్, అశోక్ పాల్గొన్నారు.

EENADU Classifieds

REAL ESTATE

LAND FOR SALE

జనగాం-హుస్నాబాద్ హైవే దగ్గరలో 1.35 ఎకరం ఎర్ర నేల తూర్పు ఫేసింగ్‌తో 600ft పొడవు 150ft వెడల్పుతో బోర్ &జాలీ ఫెన్సింగ్‌తో అమ్మబడును.పౌల్ట్రి ఫామ్స్/ ఏ ఫామ్ కైనా/ఏ తోటకైనా అనుకూలం. ✆ 8019095973.

సిద్దిపేట జిల్లా, వర్గల్ మం., శాఖారం గ్రా॥లో 9 ఎకరముల 2 గుంటలు, నాలాల్యాండ్, 30 గుంటలు అగ్రిల్యాండ్ అమ్మకానికి కలదు. 30' డాంబర్ రోడ్‌తో రింగ్ రోడ్‌కు 20 km దూరంలోకలదు. సెల్: 9849466661

JOBS

MARKETING/ SALES

రియల్‌ఎస్టేట్ శాలరీ బేస్ మార్కెటింగ్ డైరెక్టర్ కావలెను. స్మార్ట్ సిటీ, జహీరాబాద్ NIMZ 5KM, రే.3,50,000/-ప్లాట్, EMI, స్పా. రిజి. Sal+inc=50K, ✆ 9281447559

క్లాసిఫైడ్ ప్రకటనలకు సంప్రదించండి: 9000014771

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నేడు మంత్రి పర్యటన

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: అక్కన్నపేట మండలం కట్కూర్, దుబ్బతండా, దాసుతండా, చాపగానితండా, కన్నారం, పంతులు తండా గ్రామాల్లో ఈ నెల 31న పల్లె పల్లెకు పొన్నమన్న- పల్లెపల్లెల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర ప్రభాకర్‌గౌడ్ తెలిపారు. హుస్నాబాద్: శాతవాహన యూనివర్సిటీ ఇంజినీరింగు కళాశాలలోని వసతిగృహాల నిర్మాణాలకు నేడు మంత్రి పొన్నం శంకుస్థాపన చేస్తారని ప్రిన్సిపల్ తిరుపతిరెడ్డి తెలిపారు.

క్వారీకి అనుమతివ్వొద్దు

హుస్నాబాద్ గ్రామీణం: అక్కన్నపేట మండల రెవెన్యూ పరిధిలోని గుట్టకు ప్రతిపాదిత గ్రానైట్ క్వారీ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దని సీపీఐ మండల కార్యదర్శి భాస్కర్ కోరారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వనేష్, జనార్దన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు.

యూరియా చిక్కదు.. యాతన తప్పదు



యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవడం కోసం రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కేటాయించిన సమయం రాగానే చరవాణులు చేతిలో పట్టుకొని నిరీక్షిస్తున్నారు. ఎరువుల దుకాణాలు, దారుల వెంట, వ్యవసాయ క్షేత్రాల వద్ద యాప్ ఓపెన్ చేసి గంటల తరబడి ఎదురుచూస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు 5 దుకాణాల్లో 1,750 బస్తాలు అందుబాటులో ఉంచగా. క్షణాల్లో బుక్ కాగా.. మిగిలిన వారికి నిరాశే మిగిలింది. రైతులు చరవాణులు చేతపట్టుకొని పొలాల వద్ద వేచిచూస్తున్న ఈ చిత్రం కోహెడ మండలంలోని నాగసముద్రాలలోనిది. – న్యూస్‌టుడే, కోహెడ

రాష్ట్ర స్థాయి క్రీడాకారులకు సన్మానం

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ‘లయన్స్‌క్లబ్ గజ్వేల్ స్నేహ’ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారులు నిశ్చిత, అక్షిత్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు కుమారస్వామి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గణేశ్, శిక్షకుడు నర్సింలు, లయన్స్ క్లబ్ సభ్యులు సంతోష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత

కోహెడ, న్యూస్‌టుడే: కోహెడ మండలంలోని రాంచంద్రాపూర్‌కు చెందిన చామంతుల సంపత్ కుమార్ ఇటీవల మృతి చెందారు. అతడితో కలిసి 2004-05లో పదో తరగతి చదివిన మిత్రులు బాధిత కుటుంబానికి రూ.36,500లను ఆదివారం అందజేశారు. సంపత్‌కుమార్‌కు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భవిష్యత్తులోనూ అండగా ఉంటామని భరోసా కల్పించారు.

దౌల్తాబాద్, న్యూస్‌టుడే: గాజులపల్లిలో యూసుబ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో స్థానిక సర్పంచి స్వామి బాధిత కుటుంబానికి ఆదివారం బియ్యం, నిత్యావసర సరకులు అందించారు. ఉపసర్పంచి ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య భవనం.. అలంకారప్రాయం

● పనులు పూర్తయినా ప్రారంభానికి దూరం

న్యూస్‌టుడే, సిద్దిపేట, చిన్నకోడూరు: సిద్దిపేటలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) జీ+1 నూతన భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రస్తుతం స్థానిక అంబేడ్కర్‌నగర్‌లో అద్దె భవనంలో కొనసాగుతుండగా.. అరకొర వసతుల మధ్య నిర్వహిస్తున్నారు. శిథిలదశకు చేరడంతో చిన్నపాటి వానకే ఉరుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా రవాణా శాఖ కార్యాలయం సమీపంలో రూ.1.43 కోట్లతో నిర్మాణం పూర్తి చేశారు. పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా వినియోగంలోకి రాలేదు. ఫర్నీచర్, విద్యుత్తు మీటరు సమకూర్చాలి. గతంలో ఈ కొత్త భవనాన్ని ఈఎస్ఐ డిస్పెన్సరీకి కేటాయించినా అది కాస్త రద్దయింది. వెంటనే యూపీహెచ్‌సీని కొత్త భవనంలోకి మార్చాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.



సిద్దిపేటలో యూపీహెచ్‌సీ భవనం

రూ.20 లక్షలతో పల్లె దవాఖానా

చిన్నకోడూరులో రూ.20 లక్షలతో చేపట్టిన పల్లె దవాఖానా నిర్మాణ పనులు పూర్తయి సుమారు నాలుగు నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. అప్పట్లోనే విద్యుత్తు, నీటి సౌకర్యం కల్పిస్తే సరిపోయేది. ప్రస్తుతం ఈ రెండు సదుపాయాలు సైతం కల్పించారు. భవనం అన్ని సదుపాయాలతో ప్రారంభానికి సిద్ధమై సుమారు రెండు నెలలవుతున్నా అందుబాటులోకి రాలేదు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు సమన్వయంతో ప్రారంభోత్సవ ఏర్పాట్లు చేయకపోవడం వల్ల పల్లె దవాఖానా మూలనపడింది. ఇకనైనా త్వరితగతిన అందుబాటులోకి తెచ్చి మెరుగైన వైద్య సేవలందించాలని ప్రజలు కోరుతున్నారు.



చిన్నకోడూరులో పల్లె దవాఖానా

ఎనిమిదేళ్లుగా.. అసంపూర్తిగా

కలగా మిగిలిన ఐటీఐ కళాశాల భవన నిర్మాణం

దుబ్బాక, న్యూస్‌టుడే: పదో తరగతి పూర్తయిన విద్యార్థులను పారిశ్రామిక రంగంలో వృత్తి నిపుణులుగా తయారు చేసి, ఉపాధి చూపేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతి జిల్లాలో ఐటీఐ (పారిశ్రామిక శిక్షణ సంస్థ) కళాశాలలను ఏర్పాటు చేసింది. దానిలో భాగంగా 2012లో దుబ్బాక పట్టణంలోని ఒక అద్దె భవనంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటైంది. ఐటీఐ కళాశాలకు పక్కా భవనం కోసం 2018లో పట్టణ శివారులో 4 ఎకరాల విస్తీర్ణంలో రూ.5 కోట్లతో భవన నిర్మాణానికి అప్పటి మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించి 8 ఏళ్లు గడిచినా, నిధుల రాక పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.

70 శాతం పూర్తి..

● కార్మిక, ఉపాధి శాఖకు చెందిన నిధులతో జీ+1 తరహాలో ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో భవన నిర్మాణ పనులను చేపట్టారు. ● భవనం లోపల తరగతి గదులు, సమావేశ మందిరం, సిబ్బంది గదులకు ప్లాస్టరింగ్ పనులు పూర్తయినా, వెనుక వైపు విద్యార్థుల ప్రాక్టికల్ నిర్వహణకు సంబంధించి వర్క్ షెడ్ల నిర్మాణం ఇంకా గోడల స్థాయిలోనే నిలిచిపోయింది. ● ఫ్లోరింగ్, విద్యుత్తు వైరింగ్, నీటి సౌకర్యం, కిటికీలు, తలుపుల ఏర్పాటు, రంగులు వేయడం వంటి పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ● ఇప్పటి వరకు 70 శాతం మేర రూ.2.5 కోట్ల పనులు చేసిన గుత్తేదారుకు ఇటీవల విడతల వారీగా బిల్లులు మంజూరైనట్లు సమాచారం.



దుబ్బాక శివారులో భవనం దుస్థితి

అద్దె భవనంలో అవస్థలు

● పట్టణంలోని అద్దె భవనంలో కొనసాగుతున్న కళాశాలలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ కోర్సుల్లో రెండో సంవత్సరంలో 20 చొప్పున 40 మంది విద్యార్థులున్నారు. ● ఐటీఐకి అనుబంధంగా ఉన్న ఏటీసీ కేంద్రంలో కూడా ఆరు కోర్సుల్లో ఇటీవల 70 శాతం మేర సీట్లు భర్తీ అయ్యాయి. ● ప్రస్తుత అద్దె భవనంలోని ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు ఇరుకైన గదుల మధ్య తరగతుల నిర్వహణ కొనసాగుతోంది. నూతన భవనం అందుబాటులోకి వస్తే, విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని దుబ్బాక ప్రజలు కోరుతున్నారు.

త్వరలో పూర్తి చేయిస్తాం

చేసిన పనులకు గుత్తేదారుకు ఇటీవల బిల్లులు మంజూరైనట్లు తెలిసింది. మిగిలిన 30 శాతం పనులను పూర్తి చేయడానికి గుత్తేదారు ముందుకు రాకపోతే, మరొకరితో పనులు చేపట్టి నాలుగు నెలల్లో పనులు పూర్తి చేయిస్తాం.

– వెంకటేశం, ఆర్అండ్‌బీ డీఈ, దుబ్బాక

గంజాయి స్వాధీనం.. నిందితుల అరెస్టు

జగదేవపూర్, న్యూస్‌టుడే: గంజాయి అక్రమ రవాణా చేస్తూ విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను జగదేవపూర్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు.. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం మునిగడపకు చెందిన దేవుని నవీన్ కుమార్, జగదేవపూర్‌కు చెందిన శీలసాగర్ పవన్ కళ్యాణ్ అనే యువకులు జగదేవపూర్ భారత్ పెట్రోల్ బంక్ వద్ద అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనంపై తిరుగుతూ పోలీసుల కంటపడ్డారు. అదుపులోకి తీసుకొని విచారించగా వారి వద్ద 430 గ్రాముల గంజాయి లభించిందని ఎస్సై తెలిపారు. 3 చరవాణులు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

రూ.లక్షలు వెచ్చించి.. వృథాగా వదిలేసి



పచ్చదనం పెంపొందించి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వ ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో నిర్వహణ సరిగా లేక లక్ష్యం నీరుగారుతోంది. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పరిధిలోని 5వ వార్డులో దాదాపు రూ.10 లక్షలు ఖర్చుచేసి ఏర్పాటు చేసిన నర్సరీలో పెంచిన వందలాది మొక్కలను నాటకుండా వదిలిపెట్టడంతో వృథాగా మారిపోయాయి. ప్రస్తుతం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్న అధికారులు వీటిని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గజ్వేల్

‘చేసిన సేవలే ఉద్యోగికి గుర్తింపు తెస్తాయి’

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: విధినిర్వహణలో చేసిన సేవలే ఉద్యోగికి గుర్తింపునిస్తాయని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. ఆదివారం మిరుదొడ్డి మండలం అల్వాల- పెద్దచెప్యాల కూడలిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల- కళాశాల ప్రిన్సిపల్ రఘునందన్‌రావు ఉద్యోగ విరమణ పొందారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సెక్రటరీ శారదతో కలిసి ప్రిన్సిపల్‌ను శాలువాతో సన్మానించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రవీందర్, ఉమ్మడి మెదక్ జిల్లాల గురుకుల పాఠశాల, కళాశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

(c) eenadu